నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్, గురువారం 1 ఆగస్టు 2024 | ADILABAD NIRMAL

ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

ఆధ్యాత్మికతతో ఐక్యతను పెంచొచ్చు

మాజీ మంత్రి జోగు రామన్న

ఎదులాపురం, జూలై 31 : ఆధ్యాత్మిక మార్గంలో ఐక్యతను పెంపొందించుకోవచ్చని, అలాగే సనాతన ధర్మ ప్రాశస్త్యాన్ని భావి తరాలకు తెలియచెపుతూ.. ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో గల సంకటమోచన హనుమాన్ ఆలయంలో నూతనంగా నిర్మించిన గోపురం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బుధవారం వైభవోపేతంగా జరిపారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించి ఆంజనేయ స్వామిని ఆరాధించారు. ఈ కార్యక్రమ ముఖ్య అతిథిగా హాజరైన రామన్న ఆంజనేయుడిని దర్శించుకుని పూజలు చేశారు. అంతకు ముందు స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో సత్కరించారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు బొంపెల్లి హన్మాండ్లు, భాస్కర్, గందేవార్ ఉదయ్‌కుమార్, కొరెడ్డి లెనిన్, రామేశ్వర్, నల్ల మహేందర్, కుమ్ర రాజు, కొండా గణేశ్, దమ్మా పాల్ పాల్గొన్నారు.

కార్యకర్తకు పరామర్శ

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త, 34వ వార్డు మెంబర్ దారవేనీ రామకుమార్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా మాజీ మంత్రి జోగు రామన్న ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన పరిస్థితిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు.

రుణమాఫీ కోసం తిరుగుతున్న రైతులు

భైంసా, జూలై 31 : రాష్ట్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షల వరకు రుణమాఫీ చేసినప్పటికీ తమకు మాఫీ కాలేదని బుధవారం వ్యవసాయ కార్యాలయం వద్దకు రైతులు వచ్చారు. భైంసా పట్టణంతోపాటు మండలానికి చెందిన పలువురు రైతులు బ్యాంకు ఖాతా పేరుకు, ఆధార్ కార్డు పేరుకు మిస్‌మ్యాచ్ కావడం వల్ల రైతులకు రుణమాఫీ ఆగిపోయింది. దీంతో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంతో రుణమాఫీ కాని రైతులు ఆందోళనకు గురవుతూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న రైతులు

భైంసా ఏరియా దవాఖానలో ఓపీ చిట్టి కోసం క్యూ కట్టిన రోగులు

నిర్మల్‌లోని ప్రధాన దవాఖానలో ఓపీ చిట్టి రాయించుకునేందుకు బారులుదీరిన జనం

వణికిస్తున్న వ్యాధులు

డెంగీ, విషజ్వరాలతో మంచం పడుతున్న ప్రజలు

- ఆసుపత్రుల్లో బారులుదీరుతున్న బాధితులు
- నిర్మల్ జిల్లాలో ఇప్పటివరకు 14 డెంగీ కేసులు నమోదు
- ప్రభుత్వ దవాఖానల్లో అందుబాటులో లేని మందులు
- రోజు వందల సంఖ్యలో నమోదవుతున్న జ్వర కేసులు

నిర్మల్, జూలై 31(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలో పక్షం రోజులుగా వర్షాలు ఏకధాటిగా కురిశాయి. దీంతో పల్లెలు, పట్టణవాసులు డెంగీ, విషజ్వరాల బారినపడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రితోపాటు, ప్రసూతి ఆసుపత్రికి రోజు వందల సంఖ్యలో జ్వర బాధితులు వస్తున్నారు. నిర్మల్‌తోపాటు ఖానాపూర్, భైంసా ఏరియా ఆసుపత్రులు కూడా జ్వరబాధితులతో కిక్కిరిసిపోతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ప్రైవేటు ఆసుపత్రుల్లో కూడా డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్ లక్షణాలతో వందల సంఖ్యలో బాధితులు చికిత్స పొందుతున్నారు. ఈ యేడాది ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 14 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇవే కాకుండా ప్రైవేటు ఆసుపత్రుల్లో డెంగీ, టైఫాయిడ్, వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతూ చాలా మంది చికిత్స పొందుతున్నారు. కొన్ని గ్రామాల్లో జ్వరాలు విపరీతంగా ఉండడంతో అధికారులు ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తున్నారు. ఈ స్థాయిలో విషజ్వరాలు ప్రబలడానికి ప్రధాన కారణం గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్లనే అంటున్నారు. పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో కొంతకాలంగా పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదు. దీంతో అపరిశుభ్ర వాతావరణానికి తోడు వరుసగా వర్షాలు కురియడంతో సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్నాయి. చాలా మంది బాధితులు తీవ్ర జ్వరాలతో సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్తున్నారు. అయితే అక్కడి వైద్య సిబ్బంది తూ.తూ. మంత్రంగా మందులు ఇచ్చి పంపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆసుపత్రులకు పూర్తిస్థాయిలో మందుల సరఫరా జరగడం లేదు. దీంతో వైద్య సిబ్బంది చేసేదేమి లేక ఉన్న మందులను ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో కూడా సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల కొరత వేధిస్తున్నది. రోజు ఇక్కడికి వచ్చే వందలాది మంది రోగులకు అందుబాటులో ఉన్న కొన్నిరకాల మందులను మాత్రమే ఇస్తున్నారు. ముఖ్యమైన, విలువైన మందులను మాత్రం ప్రైవేటు మెడికల్ షాపుల నుంచి కొనుగోలు చేసి క్రమం తప్పకుండా వాడాలని ఉచిత సలహా ఇస్తున్నారు. ఇదేమని ఇక్కడి వైద్యాధికారులను ప్రశ్నించగా, ఆరేడు నెలలుగా సెంట్రల్ డ్రగ్స్ స్టోర్ నుంచి మందులు రావడం లేదని చెబుతున్నారు. సర్జరీల కోసం అవసరమయ్యే ముఖ్యమైన మందులను మాత్రం ఆరోగ్యశ్రీ నిధులతో ప్రైవేటులో కొనుగోలు చేస్తున్నామంటున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి ఎప్పుడూ రాలేదని, కేవలం ఈ ఆరేడు నెలలుగానే మందుల కొరత ఆసుపత్రులను పట్టి పీడిస్తున్నదని చెబుతున్నారు. మందుల కొరత కారణంగా ప్రభుత్వాసుపత్రులపై ప్రజలకు నమ్మకం పోతున్నదంటున్నారు. పేద ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు చేయించుకుంటున్నారు. కాగా.. ప్రజలు సీజనల్ వ్యాధులతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా అందడం లేదన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మామడ మండలం కొరిటికల్ హెల్త్ క్యాంప్‌లో రోగులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

14 డెంగీ కేసులు

పదిహేను రోజులుగా జిల్లా వ్యాప్తంగా విషజ్వరాలు పెరిగాయి. ఇప్పటి వరకు జిల్లాలో 14 డెంగీ కేసులు నమోదయ్యాయి. జ్వరాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించేందుకు ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. జ్వర పీడితులను గుర్తించి వెంటనే మందులను పంపిణీ చేస్తున్నాం. అలాగే వారంలో రెండు రోజులు డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నం. ఇందులో భాగంగా ప్రతి మంగళ, శుక్రవారాల్లో తమ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటున్నారు. జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులను కూడా నిర్వహిస్తున్నాం.

- డాక్టర్ ధన్‌రాజ్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి, నిర్మల్.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

కేసులకు భయపడం..

ఉట్నూర్, జూలై 31 : తమను ఎదుర్కోలేక కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యేకు ఆర్థిక మంత్రి ఎవరో తెలియడం లేదని ప్రశ్నించినందుకు బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక కార్యకర్తలపై కేసులు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. అంతగా ఉంటే తనపై కేసులు పెట్టాలని, కానీ.. కార్యకర్తలను ఇబ్బందులు పెట్టొద్దన్నారు. పదవులు శాశ్వతం కాదన్నారు. బీఆర్ఎస్ ఉద్యమం నుంచి వచ్చిన పార్టీ అని ఇటువంటి రాజకీయాలకు భయపడమన్నారు. తాము ప్రజలలో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీపై ప్రజలలో వ్యతిరేకత ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చాక నియోజక అభివృద్ధి ఏమాత్రం జరగలేదన్నారు. కేసీఆర్ తెచ్చిన తెలంగాణలో ఆయన గుర్తులు, పథకాలు మార్చుదామంటే జరగనిపనన్నారు. మొదటగా ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

భోజనం సరిగ్గాలేక అవస్థలు

ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా

ఎదులాపురం, జూలై 31 : మౌలిక వసతులు లేక, భోజనం సరిగ్గా ఉండక అవస్థలు పడుతున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అక్షయ్ అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆదిలాబాద్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం మావల పరిధిలో మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల, కళాశాల విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా అక్షయ్ మాట్లాడుతూ.. హాస్టల్ గదుల్లో ఫ్యాన్లు లేక, లైట్లు వెలగక, కరెంటు లేక బయట ఆటస్థలం, తరగతి గదుల్లో పడుకుంటున్నారని తెలిపారు. తినే సమయంలో అన్నం, పప్పు రెండోసారి అడిగితే వేసుకున్నది సరిపోతలేదా? ఇంకా ఎంత తింటావని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి హాస్టల్ విద్యార్థులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌సీవో ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడం విడ్డూరమన్నారు. దీంతో వెంటనే కలెక్టర్ స్పందించి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి కార్తీక్, నగర సంయుక్త కార్యదర్శి అరుణ్, సాయి, నిఖిల్, యశ్, ఉదయ్, విఘ్నేశ్, కైలాశ్, శ్రీశాంత్, అఖిల్, కిరణ్, రామ్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న ఏబీవీపీ సభ్యులు

ఆటో వద్దకే వచ్చి సాక్ష్యాన్ని సేకరించి..

ఉమ్మడి ఆదిలాబాద్ చరిత్రలో మొదటిసారి

ఎదులాపురం, జూలై 31 : సాక్షుల నుంచి వివరాలను వివిధ పద్ధతుల్లో నమోదు చేస్తూ ఉంటారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్రలోనే మొదటిసారిగా జిల్లా పీసీఆర్ కోర్టు న్యాయమూర్తి టి దుర్గారాణి సాక్షులు ఆటోలో ఉండగా.. వారి వద్దకే వచ్చి సాక్ష్యాన్ని నమోదు చేశారు. ఈ మేరకు కోర్టు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని జామిడి గ్రామానికి చెందిన మునేశ్వర్ రాంబాయి, భగత్ సులోచనలు 2017 సంవత్సరంలో తల మడుగు పోలీస్ స్టేషన్‌లో కే.ఉషన్న, అయిండ్ల సక్కుబాయిలపై ఫిర్యాదు చేశారు. విచారణలో భాగంగా బుధవారం ఇద్దరి బాధితుల సాక్ష్యం నమోదు చేయవలసి ఉంది. కానీ వారు ఇరువురు నడవలేని స్థితిలో ఉండడంతో వారిని తలమడుగు పోలీస్ స్టేషన్ సీడీవో సంతోష్ కానిస్టేబుల్ సహాయంతో కోర్టు ఆవరణంలోకి తీసుకొచ్చారు. మునేశ్వర్ రాంబాయి, భగత్ సులోచన పరిస్థితి పరిశీలించిన న్యాయమూర్తి బాధితులు ఉన్న ఆటో వద్దకు స్వయంగా వెళ్లి ఏపీపీ నవీన్, న్యాయవాది అమరేందర్‌రెడ్డిల సమక్షంలో సాక్ష్యాన్ని నమోదు చేశారు.

ఆటో వద్దకే వచ్చి సాక్షుల నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న పీసీఆర్ కోర్టు న్యాయమూర్తి దుర్గారాణి

సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధిని ప్రదర్శించాలి

ఎదులాపురం, జూలై 31 : రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల పోరాటాలను అణిచివేసే యత్నం చేస్తున్నదని, ఈ చిత్తశుద్ధిని కార్మికుల సమస్యల పరిష్కారంలో చూపాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లొచ్చిన ఆశలకు, గ్రామ పంచాయతీ కార్మికులకు బుధవారం ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, ఆశ యూనియన్ జిల్లా కార్యదర్శి సుజాత, నాయకులు జ్యోతి, పార్వతి, లక్ష్మి, గ్రామ పంచాయతీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : తెలంగాణ తల్లి చౌక్ వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు

వ్యవసాయాన్ని మోదీ విస్మరించారని నిరసన

ఎదులాపురం, జూలై 31 : కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించిందని, అరకొర కేటాయింపులతో సరిపెట్టిందని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు చిలక దేవిదాస్ ఆరోపించారు. బడ్జెట్‌లో సాగుకు ఆశించిన మేర కేటాయింపులు చేయకపోవడాన్ని వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం బస్టాండ్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. బడ్జెట్ ప్రతులను దహనం చేసి మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు చిలుక దేవిదాస్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని మోదీ ప్రభుత్వం విస్మరిస్తోందని, ఆశించిన మేర పెట్టుబడులు లేక సాగు రంగం కూనారిల్లే పరిస్థితి నెలకుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు దండేకర్ వామన్, ఏఐపీకేఎంఎస్ నాయకుడు కొడప సురేశ్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు వెంకట నారాయణ, జగన్ సింగ్, శంకర్, సుభాష్, నితిన్, మారుతి పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న ఏఐకేఎస్ నాయకులు

ప్లీజ్.. బదిలీని ఆపండి

- ఉన్నతాధికారులకు విన్నవించిన విద్యార్థులు
- ప్రధాన రోడ్డుపై బైఠాయించి నిరసన
- అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతి

ఎదులాపురం, జూలై 31 : ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రోడ్డెక్కారు. సాధారణ బదిలీల్లో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత ఇచ్చోడకు బదిలీ అయ్యారు. తమ కళాశాలను ప్రైవేటు, కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దిన ప్రిన్సిపాల్ బదిలీని నిలిపి వేయాలనే డిమాండ్‌తో కళాశాల విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. బదిలీని నిలిపి వేసి పూర్వ స్థానమైన ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలోనే కొనసాగించాలంటూ నినాదాలు చేశారు. అన్ని రకాల వసతులతోపాటు యూనిఫాం, యోగా, మెడిటేషన్, మోటివేషన్ క్లాసులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ జాబ్ మేళా, క్రీడా రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చొరవ తీసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు.

సార్.. మీరే ఉండాలి..

ఇంద్రవెల్లి, జూలై 31 : మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కాత్లే గంగారాంను బదిలీ చేయవద్దని పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకుని పాఠశాల నుంచి ర్యాలీగా తెలంగాణ తల్లి చౌక్‌కు వెళ్లారు. గంగారాంను బదిలీ చేయవద్దని నినాదాలు చేశారు. గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడిగా ఆగస్టు 2015లో వచ్చి తొమ్మిదేండ్లుగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించిన సారే కావాలని పేర్కొన్నారు.

ఎదులాపురం : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తూ..